

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 26.0



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి

పీ4 లక్ష్య సాధనకు సహకరించాలి

ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్‌కుమార్

భీమవరం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించి, పేదరికం లేని సమాజాన్ని రూపొందించాలన్నదే పీ4 కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'జిల్లాలో ఇంత వరకు 65 వేల బంగారు కుటుంబాలను గుర్తించాం. వారి అవసరాల మేరకు మార్గదర్శకులు ఆర్థికంగా, నైపుణ్యపరంగా, ఉపాధి కల్పన, వైద్య సహాయం ద్వారా వారికి చేయూతనిచ్చేందుకు తమ వంతు సహాయం అందించాలి. మీ పాఠశాలల్లో చదివి ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వపు విద్యార్థులకు పీ4 పై అవగాహన కల్పించి వారు మార్గదర్శకులుగా చేరి బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే విధంగా ప్రోత్సహించాలి. మీ పాఠశాల ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా మార్గదర్శకులు కావచ్చు. ఆలోచన చేసి జిల్లా యంత్రాంగానికి తెలియజేస్తే దానిని కార్యాచరణలో పెట్టడం జరుగుతుంది' అని రాహుల్ కుమార్ అన్నారు. పీ4 ప్రభుత్వ ఆశయ సాధనకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని విద్యా సంస్థల యాజమాన్యాలు తెలిపారు. సమావేశంలో డీఈవో ఇ.నారాయణ, సీపీఓ కె.శ్రీనివాస రావు, జిల్లాలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ సేవకు..
జాబితా సిద్ధం!



ప్రభుత్వానికి ఆలయ కమిటీ లిస్ట్



- బోర్డు చైర్మన్ పదవి జనసేనకు..
- నాగభూషణం పేరు ప్రతిపాదన
- సభ్యుల్లో ఆరు టీడీపీకి.. మరో ఆరు జనసేనకు.. బీజేపీ పదవిపై తర్జనభర్జన
- బోర్డులో ఇతర ప్రాంతాల వారికీ అవకాశం ఇచ్చే యోచనలో ప్రభుత్వం
- ఇబ్బందులు ఉంటాయంటున్న స్థానిక నాయకత్వం

(భీమవరం-ఆంధ్రజ్యోతి):

భీమవరం మావుళ్లమ్మ ఆలయ పాలకవర్గంపై ప్రభుత్వం తర్జన భర్జన పడుతోంది. ఇటీవల కాలంలో మావుళ్లమ్మ దేవస్థానం ఆదాయం గణనీయంగా పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఇప్పటికే అమ్మ వారి అలంకరణ కోసం ఆభరణాలు అధికమయ్యాయి. బంగారం సమర్పించే భక్తులు పెరిగారు. భవిష్యత్తులో మావుళ్లమ్మకు బంగారు చీర ఏర్పాటు కానుంది. ఈ క్రమంలో గుడికి భద్రతపై అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే అంజిబాబు ప్రస్తావించారు. ఈ క్రమంలో పాలకవర్గం ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించింది. ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయం తరహాలోనే ఇక్కడ పాలకవర్గంలో ఇతర ప్రాంతాల వారికి అవకాశం కల్పిస్తే భక్తుల ఆదరణ మరింత పెరుగుతుందన్న భావనలో ప్రభుత్వం ఉంది. కాని, స్థానిక కూటమి నాయకత్వం మాత్రం మావుళ్లమ్మ ఆలయ పాలకవర్గాన్ని నియోజకవర్గ స్థాయిలోనే నియమించాలని పట్టుబడుతోంది. ఇదే విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లింది. అమ్మవారికి సేవ చేయడానికి నియోజకవర్గంలో పోటీ పడుతుంటారు. ట్రస్ట్ బోర్డులో చోటు లభిస్తే చాలన్న భక్తులు ఎంతో మంది ఉన్నారు. చైర్మన్ పదవికి పోటీ మరింత అధికం. అందుకే ఈ పదవి నియామకం నాయకులకు పెద్ద తలనొప్పిగా మారుతోంది. స్థానిక ఎమ్మెల్యే అంజిబాబు అదే పరిస్థితిని ఎదుర్కొన్నారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పదవిని జనసేనకు కేటాయించారు. బంగారు నాగభూషణం పేరును ఖరారు చేస్తూ ట్రస్ట్ బోర్డు జాబితా ప్రభుత్వానికి వెళ్లింది. మొత్తం 13 మంది సభ్యుల్లో ఒకరు చైర్మన్ హోదాలో ఉంటారు. మిగిలిన 12 మందిలో ఆరుగురు సభ్యులను తెలుగుదేశం తరపున పంపారు. మరో ఆరుగురు సభ్యులను జనసేన నియమించేలా పేర్లు ఖరారయ్యాయి.

బీజేపీలో తెగని పంచాయితీ

బీజేపీకి మావుళ్లమ్మ ఆలయ కమిటీలో పేరు ఖరారు కాలేదు. పట్టణంలోని ఇతర ఆలయాల్లో ఐదుగురు సభ్యులు ఉండేలా పేర్లు నమోదుచేశారు. మావుళ్లమ్మ ఆలయంలోనూ బీజేపీ తరపున ఒకరికి సభ్యునిగా నియమించాలంటూ ఆ పార్టీ నుంచి ప్రతిపాదన వచ్చింది. సామాజిక వర్గాల సమతుల్యత విషయంలోనూ మల్లగుల్లాలు పడుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయం ఏమిటో..?

బోర్డు నియామకంలో ఇతర ప్రాంతాల వారికి ప్రాధాన్యం ఇవ్వాలన్న తలంపుతో ప్రభుత్వం ఉంది. ఉభయ గోదావరి జిల్లాల్లోని ఇతర దేవస్థానాలకు భీమవరం నియోజకవర్గం నుంచి పేర్లు అడిగారు. అదే తరహాలో మావుళ్లమ్మ ఆలయానికి ఇతర ప్రాంతాల నుంచి కమిటీలో అవకాశం కల్పించే అవకాశం వుంది. దీనిపై టీడీపీతో పాటు జనసేన నాయకత్వమూ వ్యతిరేకిస్తోంది. నియోజకవర్గ స్థాయిలో ఇబ్బందులు ఉంటాయని ప్రభుత్వ పెద్దల దృష్టికి వెళ్లారు. అయితే కమిటీ నియామకంలో ఎటువంటి మార్పులు, చేర్పులు ఉంటాయో చూడాలి.

హామీలు ఒక్కొక్కటిగా అమలు

- డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



కాళ్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తెలిపారు. పెద అమిరంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను ప్రారంభించారని గుర్తుచేశారు. ఉండి నియోజకవర్గంలో సొంతంగా ఫైబర్ ఆప్టికల్‌ను ఏర్పాటు చేసి 500కు పైగా సీసీ కెమెరాలకు అనుసంధానించినట్లు తెలిపారు. ప్రతి వీధిని సర్కిల్ కార్యాలయంలో పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఎవరైనా పాత నేరస్తులు నియోజకవర్గంలో అడుగుపెడితే, వారి ప్రతి కదలికను డిజిటలైజింగ్ పెట్రోలింగ్ ద్వారా గమనిస్తారన్నారు. నేరరహిత సమాజం కోసం ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు.



ఆచంటలో ఎండకలా..



పెనుగొండలో వర్షానికిలా..

ఎండా.. వాన ఉక్కిరిబిక్కిరి

పెనుగొండ/ఆచంట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వేసవిని మించి ఎండలు ఉక్కబోత, వేడి గాలులతో ప్రజలు అపసోపాలు పడుతున్నారు. వాతావరణం ఎపుడు చల్లబడుతుందా? అని ప్రజలు ఎదురుచూస్తుండగా పెనుగొండ బుధవారం మధ్యాహ్నం గంటపాటు ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అలాగే మురుగు డ్రెయిన్‌లు పొంగి పొర్లాయి. వాతావరణం చల్లబడిందని ఆనందం వ్యక్తం చేసేలోగా వర్షం తగ్గిన కాసేపటికే మళ్లీ ఉక్కబోత, ఎండ కాయడంతో అసహనం వ్యక్తం చేశారు.

స్కూల్ బస్సు బోల్తా



- పెదకామనపూడిలో స్టీరింగ్ రాడ్ విరగడంతో ప్రమాదం
- ఇద్దరు విద్యార్థులకు తీవ్రంగా, పలువురికి స్వల్పంగా గాయాలు.. రక్షించిన స్థానికులు

ముదినేపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో స్కూల్ బస్సు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు తీవ్రంగాను, పలువురికి స్వల్పంగాను గాయాలయ్యాయి. ముదినేపల్లికి చెందిన ఇండో సాక్సన్ స్కూలు బస్సు విద్యార్థులను ఎక్కించుకుని బుధవారం ఉదయం చిగురుకోట నుంచి ముదినేపల్లి బయలుదేరింది. పెదకామనపూడి సమీపంలో స్టీరింగ్ మెయిన్ రాడ్ విరిగి బస్సు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. బస్సులోని విద్యార్థులు హాహాకారాలు చేశారు. అరుపులు, కేకలు, ఏడుపులతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. ఇది విని అటుగా వెళుతున్న వడాలికి చెందిన వీరంకి నాంచారయ్య, రాజా శివ పార్వతి, మోర్త సింహాచలంతోపాటు స్థానికులు బస్సు అద్దాలు పగులకొట్టి విద్యార్థులను, డ్రైవర్ ప్రభాకరరావును సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. వీరిలో చిగురుకోట చెందిన చంద్రిక(8), ఆమె సోదరుడు సుమంత్(7)కు తీవ్రగాయాలు కాగా, మిగిలిన వారికి స్వల్పంగాను దెబ్బలు తగిలాయి. వీరిని ముదినేపల్లి, గుడివాడ ప్రభుత్వ, స్థానిక ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. విషయం తెలిసిన వెంటనే కైకలూరు సీఐ రవికుమార్, ఎస్‌ఐ వీరభద్రరావు, పోలీసు సిబ్బంది, తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. చంద్రిక తండ్రి తమ్మా నరసింహారావు ఫిర్యాదు మేరకు ముదినేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 31 మంది విద్యార్థులు ఉన్నారు. ఘటనపై ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. విద్యార్థులను కాపాడిన స్థానికులను అభినందించారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు తదితరులు ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

స్కూల్ బస్సులపై దాడులు

స్కూలు బస్సు బోల్తా ఘటనపై పోలీసు, రోడ్ ట్రాన్స్‌పోర్టు అధికారులు అప్రమత్తమయ్యారు. ఏలూరు జిల్లా రవాణా శాఖ అధికారులు ప్రైవేటు విద్యా సంస్థల బస్సులపై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 15 కేసులు నమోదు చేసి రూ.26 వేలు పెనాల్టీ విధించారు.

వేతన వేదన

- బదిలీపై వచ్చిన టీచర్లకు రెండు నెలలుగా నిలిచిన జీతాలు
- వాయిదాలు చెల్లించేందుకు ఇబ్బందులు
- విద్యా, ట్రెజరీ శాఖల మధ్య సమన్వయ లోపం.. ఉపాధ్యాయులకు శాపం

తణుకు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):జిల్లావ్యాప్తంగా బదిలీలపై వచ్చిన ఉపాధ్యాయులకు జూన్, జూలై నెలల జీతాలు విడుదల కాకపోవడంపై వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది మేలో జిల్లాలోని సుమారు నాలుగు వందల మంది టీచర్లకు వారు పనిచేస్తున్న ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి కొత్తగా చేరిన పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరికి పాత ఐడీల స్థానంలో కొత్త వాటిని జిల్లా విద్యా శాఖ, సబ్‌ట్రెజరీ అధికారులు కేటాయించాలి. కాని, రాష్ట్రవ్యాప్తంగా వీరికి ఇప్పటి వరకు ఐడీలు ఇవ్వలేదు.

మే నెలలో బదిలీపై వచ్చిన ప్రభుత్వ, జిల్లా పరిషత్, పంచాయతీరాజ్, మున్సిపల్ పాఠశాలకు కొత్తగా పోస్టులు మంజూరుచేశారు. మోడల్ స్కూల్స్ ఏర్పాటు, ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసి అవసరమైన కొత్త పోస్టులను మంజూరుచేశారు. ఈ ప్రక్రియలో జిల్లాలో 50 పాఠశాలల నుంచి 400 మంది ఉపాధ్యాయులకు క్యాడర్ స్ట్రెంగ్త్ అప్‌డేట్ కాకపోవడం వల్ల ఇప్పటి వరకు పొజిషన్ ఐడీలు క్రియేట్ చేయలేదు. ఈ విషయంలో విద్యా శాఖ ముందుగా అప్రమత్తం కాలేదు. ప్రధానంగా ఎంఈవోలు చొరవ తీసుకుని బదిలీపై వచ్చిన టీచర్లను రెండు కేటగిరీలుగా విభజించలేదని తప్పుబడుతున్నారు. రెగ్యులర్ పోస్టులోకి వచ్చిన టీచర్‌కు జీతం బిల్లు పెట్టేందుకు ఇబ్బంది లేదు. కొత్తగా కేటాయించిన పోస్టుల్లోకి వచ్చిన వారికి మాత్రమే జీతం కోసం పొజిషన్ ఐడీ రావాలి. దీనిని కొన్ని ఎంఈవోలు పరిగణనలోకి తీసుకోకపోవడంతో జూన్, జూలై నెలల జీతం బిల్లు పెట్టలేకపోయారు. ఒక నెల జీతం నిలిచిపోతే తర్వాత నెల రెగ్యులర్ జీతాల బిల్లులతో పెట్టేం వీలులేదు. ఆగస్టు తొలి వారంలో సప్లమెంటరీ బిల్లుల (మిగతా 8వ పేజీలో)



• జీతాలు లేక ఇబ్బందులు

మేలో బదిలీపై వచ్చిన టీచర్లకు రెండు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే క్యాడర్ స్ట్రెంగ్త్ అప్డేట్ చేసి పొజిషన్ ఐడి ఇచ్చి ఈ నెల సప్లమెంటరీ బిల్‌తో గత రెండు నెలలు జీతాలు చేయడానికి అవసరమైన రోజులను పొడిగించాలి.

- వి.రామ్మోహన్, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి



• సిబిల్ స్కోర్ పడిపోతోంది

విద్యా శాఖ, ట్రెజరీ అధికారులు చేయాల్సిన పనిలో జాప్యం కారణంగా ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. జీతాలు రాక బ్యాంకు వాయిదాలు చెల్లించలేక డిఫాల్టర్స్‌గా మిగిలే పరిస్థితి ఏర్పడింది. బ్యాంకులో సిబిల్ స్కోరు పడిపోతోంది. జీతాలు విడుదల చేయాలి.

- వి.సురేష్‌కుమార్, యూటీఎఫ్ పట్టణ ప్రధాన కార్యదర్శి



• సమస్య పరిష్కరించాలి

అధికారులు ఉపాధ్యాయుల జీతాల సమస్యను వెంటనే పరిష్కరించాలి. మూడు నెలలు కావొస్తున్న ఈ సమస్య ఇంకా పరిష్కరించలేదు. దీంతో ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధ్యాయులను ఇబ్బందులు గురిచేయడం సరైంది కాదు.

- ఎం.హరికృష్ణ, ఫ్యాప్టో జిల్లా కార్యదర్శి



డీఈవోకు మెమోరాండం అందిస్తున్న ఫ్యాప్టో చైర్మన్, సెక్రటరీ జనరల్ తదితరులు

విద్యా శక్తిని బహిష్కరించిన ఫ్యాప్టో

భీమవరం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యా శాఖ ప్రవేశపెట్టిన విద్యా శక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ విజయరామరాజు, సెక్రటరీ జనరల్ ప్రకాశం తెలిపారు. ఈ మేరకు డీఈవో (మిగతా 8వ పేజీలో)

మార్చురీ పక్కనే డయాలసిస్



మార్చురీ ఏర్పాటు చేస్తున్న గది

తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో రోగుల ఆందోళన

- వేరేచోటుకు మార్చాలని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వినతి..
- ఐదు నెలల్లో కొత్త భవనంలోకి మారుస్తామన్న సూపరింటెండెంట్



డయాలసిస్ రోగులు

తాడేపల్లిగూడెం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్‌కు అత్యంత చేరువలో మార్చురీ ఏర్పాటుకు తీసుకున్న నిర్ణయం రోగుల పాలిట శాపంగా మారింది. మార్చురీని ఆనుకుని నిర్మాణాలు జరగడంతో దానిని డయాలసిస్ సెంటర్ సమీపంలోని ఎవరూ లేని సిబ్బంది క్వార్టర్స్‌కు మార్చారు. తాజాగా ఈ క్వార్టర్స్ తొలగించాలని ప్రతిపాదనలు పంపారు. దీంతో రోగుల్లో ఆందోళన మొదలైంది. డయాలసిస్ సెంటర్‌కు ప్రత్యేకత ఉంది. 2016 సెప్టెంబరు 23న అప్పటి తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు దీనిని పది బెడ్స్‌తో ఏర్పాటు చేయించారు. ఇప్పుడు 23 బెడ్స్‌కు పెరిగింది. డయాలసిస్ సెంటర్ పరిధిలో 150 మంది రోగులు జిల్లా నలుమూలల నుంచి నమోదు చేయించుకున్నారు. వీరికి నాలుగు షిఫ్ట్‌లుగా రోజుకు 55 నుంచి 60 మందికి డయాలసిస్ చేస్తున్నారు. ఒక్కొక్కరికి నాలుగు గంటలు సమయం పడుతుంది. నిత్యం రద్దీగా ఉండే ఈ సెంటర్‌కు అత్యంత చేరువలో మార్చురీని ఏర్పాటు చేయడానికి అధికారులు నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశమైంది. డయాలసిస్‌తో ఇబ్బందులు పడే వారికి కాస్త ప్రశాంత వాతావరణంలో సెంటర్ ఉండాలి. కాని మార్చురీకి దగ్గరగా తీసుకురావడం వల్ల పరిసరాలు అపరిశుభ్రతోపాటు దుర్గంధం వెదజల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలను ఆలోచించాలని వారు కోరుతున్నారు. 'మార్చురీ ముఖ ద్వారం డయాలసిస్ సెంటర్ వైపు కాకుండా వెనుక వైపు ఏర్పాటు చేస్తున్నాం. ఐదు నెలల్లో కొత్త భవనంలోకి మార్చురీని తరలించే వరకు సహకరించాలి' అని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిపాల్ చెప్పారు.


ప్రత్యామ్నాయం చూడాలి



- 'అసలే మా ఆరోగ్య పరిస్థితి అంతంత మాత్రం. డయాలసిస్‌కు వస్తే ప్రశాంత వాతావరణం ఉండాలి. కాని, మార్చురీ పక్కన ఉంటే డయాలసిస్ ఎలా చేయించుకోవాలి' అని తోకలపల్లికి చెందిన భలే గంగరాజు ప్రశ్నిస్తున్నారు.



- 'ఆఖరు దశకు చేరిన మేం దగ్గరలో శవాలను చూస్తూ వైద్యం చేయించుకోవాలా? మమ్మల్ని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలి. మాకు తగిన వాతావరణం కల్పించాలి' అని తాడేపల్లిగూడెంకు చెందిన రామిశెట్టి తాతారావు అడుగుతున్నారు.



- 'ఆరోగ్యాన్ని కుదుటపరుచుకోవడానికి సుదూర ప్రాంతాల నుంచి వస్తే ఎదురుగా మార్చురీని ఏర్పాటు చేస్తే ఎలా ? ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలి' అని నల్లజర్లకు చెందిన ములకాల సావిత్రి కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా 'పాలకొల్లు టిడ్కో గృహాల కాలనీ'

- విచ్చలవిడిగా మైనర్ల గంజాయి సేవనం
- సాయంత్రమైతే హల్‌చల్.. హడలిపోతున్న ప్రజలు - 7లో..



ఆలయంలో విచారణ చేస్తున్న దేవదాయశాఖ అధికారులు

క్షేత్రస్థాయిలో మరోసారి విచారణ చేస్తాం

గూటాల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నకిలీ రశీదు బుక్‌ల వ్యవహారంపై ఆర్జేసీ విచారణ

పోలవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పోలవరం మండలం గూటాల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం దేవ దాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ వేంద్ర త్రినాథరావు ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన నకిలీ రశీదు బుక్‌ల విషయంలో విచారణ నిర్వహించారు. ఆలయం పేరిట దేవ దాయశాఖ అనుమతులు లేకుండా నకిలీ రశీదు బుక్కులు ముద్రించి ఆలయ కమిటీ సభ్యులు రెండుకోట్ల రూపాయల వరకూ సొమ్ము స్వాహా చేశారంటూ గ్రామానికి చెందిన వ్యక్తి ఇచ్చిన సమా చారం మేరకు గత నెల 20న 'నకిలీ రశీదులపై చర్యలు తీసుకోండి' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తా కథనంతో స్పందించిన దేవదాయ శాఖ అధికారులు జూలై 22వ తేదీన విచారణ నిర్వహించారు. ఫిర్యాదుదారుడు విచారణకు హాజరు కాకపోవడంతో విచారణ వాయిదా పడింది. తాజాగా రీజనల్ జాయింట్ కమిషనర్, ఏలూరు అసిస్టెంట్ కమీషనర్ శ్రీనివాస్, ఇన్ స్పెక్టర్ ఫణి ఆధ్వర్యంలో జరిగిన విచారణలో అధికారులు ఫిర్యాదుదారుడు చవల మహేష్ స్టేట్‌మెంట్ తీసుకున్నారు. విచారణ సమయంలో గ్రామస్థులు, దేవాలయ కమిటీ సభ్యుల మధ్య కొంత వాగ్వివాదం జరిగింది. రీజనల్ జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుని స్టేట్‌మెంట్ తీసుకున్నామని రెండు కోట్ల మేర అవినీతి జరిగిందని చెప్పిన ప్రకారం తగిన రశీదులు చూపలేకపోయారన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో పునర్విచారణ చేయనున్నట్లు తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చాగంటి సురేష్ నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామిని దర్శించుకున్న ఏలూరు జడ్జి శ్రీదేవి



భీమవరం టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వర జనార్ధన స్వామిని బుధవారం ఏలూరు జిల్లా జడ్జి ఎస్.శ్రీదేవి దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారి కుటుంబ సభ్యుల పేరిట పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. ఈవో కృష్ణంరాజు దేవస్థానం తరుపున శేషవస్త్రం,ప్రసాదం అందించారు.

నేటి నుంచి చిన వెంకన్న పవిత్రోత్సవాలు

ఈనెల 10 వరకూ నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలు రద్దు



పవిత్రాలు ధరించిన లక్ష్మీపురం ఆలయంలోని శ్రీనివాసుని మూలవిరాట్

ద్వారకాతిరుమల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి దివ్య పవిత్రోత్సవాలు శ్రీవారి సన్నిధిలో గురువారం సాయంత్రం నుంచి ప్రారంభం కానున్నాయి.. 10వ తేదీ వరకూ నాలుగురోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు.ఏడాది పొడవునా ఆలయంలో తెలిసి తెలియక జరిగిన తప్పుల ప్రాయఃచిత్తం నిమిత్తం ప్రతీ ఏటా వీటిని నిర్వహించడం సంప్రదాయబద్ధంగా వస్తున్నది. ఉత్సవాల్లో భాగంగా 7 సాయంత్రం అంకురార్పణ, 8న పవిత్రాధివాసం, 9న పవిత్రారోపణ, 10న జరిగే శ్రీమహాపూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని తెలిపారు. ఉత్సవాలు జరిగే ఆయా రోజుల్లో శ్రీవారి నిత్యార్జిత కల్యాణాలు. ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ ఈఓ ఎన్వీ సత్యన్నారాయణమూర్తి వివరించారు. అలాగే పురాతన లక్ష్మీపురం ఆలయంలో స్వామి వారి దివ్యపవిత్రోత్సవాలు ఈనెల 18 నుంచి 21 వరకూ నాలుగు రోజుల పాటు జరుగుతాయని ఈవో మూర్తి తెలిపారు. 18 సాయంత్రం అంకురార్పణతో ప్రారంభమయ్యే ఉత్సవాలు 21న జరుగనున్న మహాపూర్ణాహుతి హోమంతో పూర్తి అవుతుందని భక్తులు తరలి రావాలని ఈవో కోరారు.

కుంకుళ్లమ్మకు విశేష పూజలు



ద్వారకాతిరుమల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): క్షేత్రదేవత కుంకుళ్లమ్మవారు శాకాంబరీ దేవిగా శుక్రవారం భక్తులకు దర్శనమీయనున్నట్లు ఆలయ ఈఓ ఎన్వీ సత్యన్నారాయణ మూర్తి తెలిపారు. ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రానికి ఉపాలయమైన ఈ ఆలయంలో అమ్మవారు వివిధ కూరగాయల అలంకారంలో భక్తులకు దర్శనమీయను న్నారని అమ్మను దర్శించి తరించాలని కోరారు. బుధవారం సాయంత్రం విశేష పుష్పాలంకారాల్లో ఉన్న అమ్మవారికి వేద మంత్రోచ్చరణల నడుమ ఆలయ అర్చ కులు కుంకుమ పూజలు జరిపారు.

చేనేతకు చేయూత



అత్తిలి మండలం శివపురంలో మగ్గంపై వస్త్రాన్ని నేస్తున్న చేనేత కార్మికురాలు

ప్రోత్సాహమిస్తున్న కూటమి ప్రభుత్వం

గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన సొసైటీలు

పోటీ తట్టుకోలేక వేరే వృత్తుల్లోకి వెళ్లిపోతున్న కార్మికులు

నేడు జాతీయ చేనేత దినోత్సవం

తణుకు రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచలోనే అతి ప్రాచీన వృత్తుల్లో చేనేత వృత్తి ఒకటి. భారతదేశం చేనేత పరిశ్రమ ప్రపంచస్థాయి గుర్తింపు పొందింది. భారత జాతీయ ఉద్యమంలో చేనేతకు ప్రత్యేక స్థానం వుంది. మహాత్మాగాంధీ స్వయంగా రాట్నం వడికి విదేశీ వస్తు బహిష్కరణకు నాంది పలికారు. 1905 సంవత్సరం ఆగస్టు 7న కోల్‌కతాలో జరిగిన సమావేశంలో విదేశీ వస్తువులను బహిష్కరిస్తూ స్వదేశీ ఉద్యమాన్ని నిర్మించాలని తీర్మానించిన రోజును జాతీయ చేనేత దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఎంతో ప్రాచీన వృత్తి, కళగా వున్న చేనేత దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేందుకు 2005లో ఉమ్మడి తెలుగు రాష్ట్రానికి చెందిన రాపోలు ఆనంద భాస్కర్ విశేష కృషి చేశారు. ఆయన కృషితో 2015 ఆగస్టు 7వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చెన్నైలో జాతీయ చేనేత దినోత్సవం అధికారికంగా ప్రకటించారు. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా చేనేత దినోత్సవం నిర్వహిస్తున్నారు. చేనేత వృత్తిలో నైపుణ్యం కనబర్చిన వారికి సంత్ గురుదాస్ అవార్డులను అందజేస్తున్నారు.

తగ్గుతున్న వృత్తి దారులు

చేనేత వృత్తి ఆధారంగా మొత్త రాష్ట్రవ్యాప్తంగా సుమారు 60 లక్షల మంది ఆధారపడగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 60 వేల మంది వరకూ చేనేత కార్మికులు వున్నట్లు చేనేత సొసైటీ లెక్కలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం చేనేత రంగంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా ఉమ్మడి జిల్లాలో చేనేత మగ్గాలపై పని చేసే కార్మికులు సుమారు 20 వేల వరకూ తమ వృత్తి కొన సాగిస్తున్నారు. చేనేత వృత్తి లాభసాటిగా లేక పోవడంతో ఆ వృత్తిలో కొనసాగ లేక ఇతర ఉద్యోగాలు, వృత్తులకు మారిపోతున్నారు. చేనేత వృత్తిలో వున్న ఎక్కువ శాతం వస్త్ర వ్యాపారంలోకి మారడం లేదా ఇతర వృత్తుల్లోకి మారిపోయారు. ఇటీవల కాలంలో యువత వస్త్ర ధారణలో వచ్చిన మార్పులు చేనేతకు ప్రోత్సాహకరంగా వుంటున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ముఖ్యంగా పంచెలు, కాటన్ షర్ట్‌లు దోవతులు, చేనేత చీరలకు ఇటీవల కాలంలో డిమాండ్ పెరిగిందని పేర్కొంటున్నారు.

> నార బట్టలు కట్టుకునే విదేశీయులకు భారతీయ చేనేత కళాకారులు అందమైన మృదువైన వస్త్రాలను అందించిన ఘనత వుంది. బ్రిటన్ రాణికి సుమారు 9 మీటర్ల చీరను అగ్గిపెట్టెలో పెట్టి అందించారు. కలియుగ దైవం వేంకటేశ్వర స్వామికి చేనేత వస్త్రాలనే బహూకరించడం సంప్రదాయం.

పూర్వ వైభవం తీసుకురావాలి



చేనేత మగ్గాలకు విద్యుత్ సబ్సిడీ ఇస్తూ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా హర్షనీయం. ఈనిర్ణయం ద్వారా లక్షలాది చేనేత కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తుంది. ఒకప్పుడు ఎంతో ప్రతిష్టాత్మక వృత్తిగా వున్న చేనేతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేయాలి. ఇప్పటికే ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు చేనేతపై వున్న జీఎస్టీని రద్దు చేసి చేనేతపై భారం తగ్గించారు. చేనేత కార్మికులకు వున్న రుణాలను రద్దు చేయాలి. చేనేత కుటుంబాలకు, చేనేత వృత్తి చేసుకునే వారికి రుణ పరపతి పెంచాలి. చేనేత సహకార ఆర్థిక సంస్థలో ఏడీఏ వంటి ఉద్యోగులను చేనేత కులాల వారినే నియ మించాలి. చేనే తలకు విద్యుత్ సబ్సిడీ, ఇతర ముడి సరుకులలో సబ్సిడీలను అందించాలి. పేద చేనేత కుటుంబానికి 3 సెంట్ల నివాస స్థలాలను ఇవ్వాలి. చేనేత పరిశ్రమకు ప్రోత్సాహకాలు అందించాలి.

-వావిలాల సరళాదేవి, రాష్ట్ర చేనేత ఆర్థిక సహకార సంస్థ మాజీ చైర్మన్, తణుకు

కొన్ని రకాల వస్త్రాలు రిజర్వు చేయాలి



నేటి వస్త్ర పరిశ్రమలో వస్తున్న అనేక పోటీ వస్తువులను తట్టుకునేందుకు ప్రభుత్వం కొన్ని రకాల వస్త్రాలను చేనేత రంగానికి కేటాయించి వాటికి ప్రభుత్వమే మార్కెటింగ్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలి. గతంలో 11 రకాల వస్త్రాలను ప్రభుత్వం చేనేతలకు కేటాయించారు. ప్రస్తుతం అది అమలు కావడం లేదు. ఇప్పుడు వాటిలో కనీసం ఐదు వస్త్రాలనైనా చేనేతలకు కోసం కేటాయించాలి. చేనేత కుటుంబాలకు వర్షాకాలంలో పని లేని రోజుల్లో భత్యంగా ఇచ్చే రూ.24 వేల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అమలు చేయాలి. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నిర్వీర్యమై పోయిన చేనేత సొసైటీలకు నిధులు కేటాయించి ఆదుకోవాలి. చేనేత కార్మికుల ఆరోగ్య, బీమా పథకాలను పునరుద్ధరించాలి.

-గుడిమెట్ల మల్లేశ్వరరావు,శివపురం చేనేత సొసైటీ మాజీ అధ్యక్షుడు, అత్తిలి మండలం

చెత్తకు మోక్షం

జంగారెడ్డిగూడెం డంపింగ్ యార్డు వద్ద రీసైక్లింగ్ యంత్రం



వ్యర్థాల నిర్వహణలో ఉత్తమ ఫలితాలు

స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ద్వారా రూ.1.36 కోట్లు

జంగారెడ్డిగూడెం డంపింగ్ యార్డులో మూడు నెలల్లో 18,736 మెట్రిక్ టన్నుల వ్యర్థాల రీసైక్లింగ్

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. దీనిలో భాగంగా స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ద్వారా జంగారెడ్డిగూడెం పట్టణంలోని డంపింగ్ యార్డులో చేపట్టిన వ్యర్థాల నిర్వహణతో ఉత్తమ ఫలితాలు కనిపిస్తున్నాయి. దాదాపు 20 సంవత్సరాల నుంచి డంపింగ్ యార్డులో ఎనిమిది అడుగులకు పైగా పేరుకుపోయిన వ్యర్థాలను (లెగసీ వేస్ట్) రీసైక్లింగ్ చేయడంతో అపరిశుభ్రంగా ఉన్న డంపింగ్ యార్డులో నేడు పరిశుభ్రమైన వాతావరణం కనిపిస్తున్నది. పట్టణంలోని 29 వార్డుల నుంచి ప్రతీ రోజు 20 టన్నుల తడి, పొడి చెత్తను పారిశుధ్య కార్మికులు సేకరించి స్థానిక బైనేరు వంతెన వద్ద ఉన్న డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి సంస్థ కింద పనిచేసే స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్‌కు స్థానిక డంపింగ్ యార్డు వద్ద ఉన్న వ్యర్థాలను వేరు చేయడానికి ప్రభుత్వం రూ. 1.36 కోట్లు మంజూరు చేసింది. దీనిలో అర్బన్ లోకల్ బాడీ షేర్ (యుఎల్‌బీ) కింద జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 51 లక్షలు మంజూరు చేశారు. గుంటూరుకు చెందిన అవినాశ్ ఏజెన్సీ వారు కాంట్రాక్టును పొంది ఫిబ్రవరి నెలలో చెత్తను వేరు పరిచే రీసైక్లింగ్ చేసే పరికరాలను జంగారెడ్డిగూడెం డంపింగ్ యార్డు వద్ద అమర్చి పనులు ప్రారంభించారు. మొత్తం 58 వేల 736 మెట్రిక్ టన్నులకు మే నెలాఖరుకి 18,736 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేశారు. మిగతా 33 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను అక్టోబర్ నెలలో పూర్తిచేస్తారు.

> తడి, పొడి చెత్త, రాళ్లు, మట్టి, ప్లాస్టిక్, వేస్ట్ క్లాత్‌లను రీ సైక్లింగ్ యంత్రంలో వేయడంతో ఆ యంత్రం ఏ భాగానికి ఆ భాగం వేరు చేస్తుంది. వచ్చిన మెటీరియల్ లో మట్టిని పట్టణంలో లోతట్టు ప్రాంతాలను పూడ్చడానికి ఉపయో గించారు. రాళ్లను రోడ్ల నిర్మాణానికి ఉపయోగించారు. ప్లాస్టిక్, క్లాత్‌లతో వచ్చిన వేస్ట్‌ను గుంటూరు జిందాల్ విద్యుత్ ప్లాంట్‌కు పంపించారు.

స్వచ్ఛ జంగారెడ్డిగూడెం లక్ష్యం



స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ సహకారంతో డంపింగ్ యార్డులో 18,736 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేశాం. డంపింగ్ యార్డు పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉండేందుకు మొక్కలు నాటి పార్కుగా అభివృద్ధి చేస్తాం. అక్టోబర్ 2 నుంచి డంపింగ్ యార్డులో చెత్తను ఎప్పటి కప్పుడు రీ సైక్లింగ్ చేయడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. అందుకోసం చిన్న చిన్న యంత్రా లను అందచేయనున్నది. ప్లాస్టిక్, క్లాత్‌లను రీసైక్లింగ్ చేయగా వచ్చిన వేస్ట్‌ను త్వరలో రాజమండ్రిలో పూర్తికావస్తున్న పవర్ ప్లాంట్‌కు పంపుతాం. ప్రభుత్వం యాభై శాతం సబ్సిడీతో పట్టణానికి రూ.70 లక్షల విలువైన స్వీపింగ్ మెషిన్, చెత్తను తరలించడానికి రూ.65 లక్షలతో కాంపాక్టర్‌ను ఇవ్వనుంది. ఇళ్ల నుంచి చెత్తను సేకరించడానికి అద్దె ప్రాతిపదికన పదమూడు ఈ-ఆటోలు కేటాయించారు. స్వచ్ఛ జంగా రెడ్డిగూడెంగా చేయడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నాం.

- కెవి.రమణ,మున్సిపల్ కమిషనర్, జంగారెడ్డిగూడెం

సంపద కేంద్రాల మాటేమిటి ?

పెనుగొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా మూలన పడ్డ సంపద తయారీ కేంద్రాలకు కూటమి ప్రభుత్వం రావడంతో వాటికి మోక్షం లభించే రోజులు వచ్చినట్లు భావించారు. కాని ఇంకా ఎక్కడా అమల్లో కనిపించడం లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో చెత్తను పోగు చేసి దానిని వర్మి కంపోస్టు తదితర పని కొచ్చే పదార్థాలుగా తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం రాబట్టేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా సుమారు రూ.20 లక్షలతో ఆయా గ్రామాల్లో షెడ్లు నిర్మించారు. అప్పట్లో 1, 2 సంవత్సరాల పాటు ఈ కేంద్రాలు వద్ద కార్యకలాపాలు నిర్వహించినప్పటికి అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటిని పక్కన పెట్టాయి. దీంతో ఆ కేంద్రాల చుట్టు తుప్పలు పెరిగిపోయి కేంద్రాల దగ్గరకు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. గ్రామాల్లో పోగు చేసిన చెత్త చెదారాన్ని అక్కడక్కడ గుట్టలుగా పోయడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొనేది. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులో వేయకుండా సంపద కేంద్రాలకు తరలించి అక్కడి నుంచి సంపద తయారు చేయాలనే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేశారు. పవన్ కల్యాణ్ పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఈ కేంద్రాలపై దృష్టి పెడతారనే ఉద్దేశంతో తుప్పలు, పిచ్చిమొక్కలతో నిండిపోయిన సంపద కేంద్రాలు వద్ద శుభ్రం చేయించారు.



పెనుగొండలో అందంగా తీర్చిద్దిన సంపద తయారీ కేంద్రం



ఆకివీడులోని మత్స్యశాఖ కార్యాలయం

మత్స్యశాఖ పనిచేస్తోందా.. ?

ఆకివీడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆకివీడులో మత్స్యశాఖ పనిచేస్తోందా ? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు ఆక్వా రైతులు.. అయి-భీమవరం రోడ్‌లో ఉన్న మత్స్యశాఖ కార్యాలయం గత శనివారం వెళితే తాళాలు వేసి ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో లక్షలు వెచ్చించి మత్స్యశాఖ కార్యాలయం నిర్మించారు. ఈ కార్యాలయంలో అధికారులు సక్రమంగా ఉండడం లేదని ఆక్వాకు సంబంధించిన ల్యాబ్ తదితర పరీక్షలు అడపాదడపా చేయడం తప్ప నిత్యం చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు ల్యాబ్‌లలో పరీక్షలు చేయించుకుంటే వేలకు వేలు డబ్బులు అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఆక్వా సమస్యలపై తెలుసుకుందామంటే అధికారి, సిబ్బంది ఉండరని అడిగితే క్యాంపులపై బయటకు వెళుతున్నామని చెబుతుంటారని రైతులు ఆగ్రహిస్తున్నారు. ఈ కార్యాయలంలో సమాధానం చెప్పే నాధుడే ఉండడం లేదని అధికారులు దృష్టి పెట్టి సమస్య పరిష్కరించాలని ఆక్వా రైతులు కోరుకుంటున్నారు.



దుంపగడపలో నిర్మాణం మధ్యలో ఆగిపోయిన తరగతి గది

అసంపూర్తి భవనాలతో ఇబ్బందులు

మధ్యలోనే ఆగిపోయిన నాడు-నేడు తరగతి గదులు

ఆకివీడు రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : నిధులు మంజూరు కాక మధ్యలోనే తరగతి గదుల నిర్మాణం నలిచిపోయి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. నాడు-నేడు రెండోవిడత కార్యక్రమంలో గత ప్రభుత్వం ఆకివీడు మండలంలోని 30 పాఠశాలలకు రూ. 10.93 కోట్లు నిధులు మంజూరు చేసింది. దీనిలో రూ.5.35 కోట్లు విడుదల చెయ్యగా, పేరెంట్స్ కమిటీ ఖాతాకు రూ.3.02 కోట్లు జమ అవ్వగా మిగిలినది ఇసుక, సిమెంట్ ఇతరత్రా కాంపోనెంట్స్‌కు జమయ్యాయి. ఇంకా రూ.5.58 కోట్లు నిధులు విడుదల అవకపోవడంతో పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఆకివీడు మండలం దుంపగడపకు జడ్పీ పాఠశాలలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు సుమారు 270 మంది ఉన్నారు. వీరికి సరిపడా తరగతి గదులు లేవు. నాడు-నేడులో 2021లో రెండు తరగతి గదులు నిర్మాణానికి రూ.24 లక్షలు మంజూరు చేయగా రూ.8 లక్షలు మాత్రమే విడుదలయ్యాయి. ఇక్కడ బేస్‌మెంట్ మాత్రమే పూర్తి అయ్యింది. శిథిలావస్థకు చేరిన చెరుకుమిల్లి, తాళ్ళకోడు, నందమిల్లిపాడు, అప్పారావుపేట గ్రామాలలో ఎంపీపీ పాఠశాలల్లో నూతన భవనాల నిర్మాణానికి ఒక్కొ భవనానికి రూ.43 లక్షలు చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఒక్కొ తరగతి గది నిర్మాణం పూర్తి అయ్యింది. రంగులు, తలుపులు, కిటికీలు, కొన్నిచోట్ల టైల్స్ వెయ్యాల్సి ఉంది. చేసేది లేక అవే గదులలో తరగతులు నడుస్తున్నాయి. జడ్పీ పాఠశాలలో సైతం నిధులు మంజూరై పనులు ఆగిపోయాయి. పనులు ఏ స్థాయిలో ఆగిపోయాయో ఉన్నతాధికా రులకు ఆయా పాఠశాలల హెచ్ఎం నివేదికలు అందజేశారు.



కళింగపాలెంలో స్లాబ్ వేసి ఆగిపోయిన తరగతి గదులు

ప్రోబ్లమ్ జోన్



కోరుకొల్లు రైతు సేవా కేంద్రం వద్ద వంటలు వండుకుంటున్న కూలీలు

నిరుపయోగంగా రైతు సేవా కేంద్రం

అద్దె భవనంలో నిర్వహణపై గ్రామస్థుల ఆగ్రహం

పాలకోడేరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్నట్లు రైతుల కోసం రైతు సేవా కేంద్రాన్ని నిర్మించినా ఆ భవనాన్ని కాదని అద్దె భవనంలో రైతు సేవా కేంద్రాన్ని నిర్వహించడం పట్ల ఇదేమిటని గ్రామ టీడీపీ నాయకుడు గాదిరాజు శ్రీనివాసరాజు, పలువురు గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. కోరుకొల్లు గ్రామంలో రైతుల ప్రయోజనార్థం రైతు సేవా కేంద్రాన్ని సుమారు ఏడాది క్రితమే నిర్మించారు. అయితే ఆ భవనాన్ని ప్రారంభించకుండా అద్దె భవనంలో రైతు సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల శ్రీనివాసరాజు గత కొంత కాలంగా ఆగ్రహిస్తూ వస్తున్నారు. ఇదే తరుణంలో గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రం భవనం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నా ఆ భవనాన్ని ప్రారంభించకుండా అదే భవనంలో కూలీలకు ఆశ్రయం ఇవ్వడం పట్ల ఆయన మండల అధికారులకు ఫొటోలు పెట్టి తెలియపరిచారు. అసలే పంచాయతీకి అంతంత మాత్రంగా ఆదాయ వనరులు ఉన్న సమయంలో ఉన్న సొమ్మును వేరే ప్రజలకు ఉపయోగపడే వాటికి వినియోగించకుండా రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించకుండా వదిలివేయడం దారుణమని ఆరోపించారు. ఇదే విషయంపై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు దృష్టికి కూడా తీసుకువెళ్తానని వివరించారు.



బేస్‌మెంట్‌లో ఆగిపోయిన ఇలపర్రు సచివాలయ భవనం

సచివాలయ భవనాలు పూర్తయ్యేనా ?

పెనుగొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సత్వర సేవలు ప్రజలకు అందించేందుకు గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. ప్రతీ గ్రామంలో స్థల సేకరణ చేసి సచివాలయ భవన నిర్మాణాలు చేట్టారు. పెనుగొండ మండలంలో 18 సచివాలయాలు భవన నిర్మాణాలకు చర్యలు తీసుకున్నారు. 10 భవనాలు పూర్తయి ప్రారంభోత్సవాలు కూడా చేశారు. మిగిలిన భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఒక్కొ భవనానికి రూ. 45 లక్షలు వ్యయంతో నిర్మాణాలు చేపట్టిన కొన్నిచోట్ల నిధులు మంజూరు కాక పోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇలపర్రు సచివాలయ భవనం అసంపూర్తిగా ఉండిపోవడంతో క్షత్రియ యువజన సంఘ భవనంలో ఇరుకుగా ఉన్నా గదుల్లో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ భవనంలోనే పోస్టాఫీసు కూడా ఉండటం విశేషం. దీంతో సచివాలయానికి వచ్చే పలువురు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రేపటి నుంచి క్రీడా పోటీలు

భీమవరం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా జోనల్, రాష్ట్ర స్థాయిలో అండర్-22 క్రీడా పోటీలు జిల్లాలో ఈనెల 8వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు డిస్ట్రిక్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాలపై ఈనెల 29న హాకీ లెజెండ్ మేజర్ ధ్యానచంద్ పుట్టిన రోజు సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పది విభాగాలలో క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు తణుకులో జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. 14 సంవత్సరాలు పైబడి 22 సంవత్సరాలు లోబడి ఉన్న బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, బ్యాంకు ఖాతా బుక్ జిరాక్స్ అందించాలన్నారు.



యూజీసీ అటానమస్ పత్రం చూపిస్తున్న కళాశాల యాజమాన్యం

సీఎస్ఎన్ డిగ్రీ, పీజీ కళాశాలకు యూజీసీ అటానమస్ స్టేటస్

భీమవరం రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): భీమవరం సీఎస్ఎన్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు యూజీసీ అటానమస్ స్టేటస్ సర్టిఫికెట్‌ను అందించిందని కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ముత్యాల రత్నం, డాక్టర్ చీడే సత్యనారాయణ తెలిపారు. బుధవారం కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమ విద్య సంస్థలో ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు వివిధ రకాల కోర్సులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అన్నారు. 1991లో విద్యా సంస్థను ప్రారంభించగా 1992లో ఇంగ్లిష్ మీడియం స్కూల్, 1994లో డిగ్రీ, 2000లో పీజీ కళాశాల, 2008లో ఫార్మసీ, 2012లో డీఎడ్, 2024లో నాక్ 'ఏ' గ్రేడ్ వచ్చాయని, యూనివర్సిటీ స్థాయికి కళాశాల చేరుకుందన్నారు. పదేళ్లపాటు (2025-2034) కళాశాలకు స్వయం ప్రతిపత్తి అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు అత్యాధునిక సదుపాయాలను అందిస్తూ 20 ఏళ్ళ అనుభవం కలిగిన అధ్యాపకులతో మెరుగైన బోధన కల్పిస్తున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సకుమళ్ళ సత్యనారాయణ మాట్లాడుతూ డిగ్రీలో బీఎస్సీ, బీకాం, పీజీలో ఎంఎస్సీ వంటి ఎన్నో కోర్సులతో విద్యాబోధన అందిస్తున్నామన్నారు. పాలకవర్గ సభ్యులు వడుపు గోపి, గాదిరాజు సత్యనారాయణరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉల్లాస్ అక్షరాంధ్ర వలంటీర్ల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి సత్యనారాయణ

నిరక్షరాస్యుల కోసం 'ఉల్లాస్ అక్షరాంధ్ర'

తణుకు రూరల్, అగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తణుకు మండలంలో స్వయం సహాయక సంఘాల్లో వున్న 2500 నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు ఆగస్టు నుంచి మార్చి నెలవరకూ ఉల్లాస్ అక్షరాంధ్ర అక్షరా స్యత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వయోజన విద్య జిల్లా నోడల్ అధికారి కేవీవీ సత్యనారాయణ చెప్పారు. బుధవారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ అక్షరాంధ్ర వలంటీర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తణుకు మండలంలోని డీఆర్‌డీఏ గ్రూపులలో వున్న నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పేందుకు 250 మంది వలంటీర్లను నియమించినట్లు తెలిపారు. వీరంతా ఈనెల నుంచి వచ్చే సంవత్సరం మార్చి వరకూ అక్షరాలు నేర్పిస్తారని, మార్చినెల చివరి వారంలో వారందరికీ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.డీఆర్‌డీఏ ఏపీఎం రామకృష్ణ, ఎంపీడీవో కార్యాలయ ఏవో కృష్ణ చంద్రరావు, విద్యాశాఖ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

9న ఏలూరులో శ్రీశ్రీ కళావేదిక సింగర్స్ ఫెస్ట్

ఏలూరు రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక నిరంతరం సాహిత్య క్రతువులో భాగంగా అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో ఆగస్టు 9న ఏలూరులో సింగర్స్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు శ్రీశ్రీ కళావేదిక నేషనల్ ప్లానింగ్ అధికారి, జాతీయ ప్రధాన కార్యదర్శి ఏలూరు జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ టి.పార్థసారథి తెలిపారు.ఏలూరులో శ్రీశ్రీ కళావేదిక ఏలూరు జిల్లా అధ్యక్షుడు శ్రీహరి కోటి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్థసారథి మాట్లాడుతూ ఈనెల 9న మహాలక్ష్మీ గోపాలస్వామి కళ్యాణ మండపంలో వందమంది సింగర్స్‌తో నాన్ స్టాప్ ట్రాక్ సింగింగ్ పేరిట బిగ్ ఈవెంట్ నిర్వహించి సింగర్స్ అందరికి స్వర కిరీటి బిరుదు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఏలూరు జిల్లాశాఖ కన్వీనర్ జి.కృష్ణ మనోహర్, ఉపాధ్యక్షుడు కస్తూరిరావు, కోకన్వీనర్ సుజయ్‌కృష్ణ, మహిళా అధ్యక్షురాలు శ్యామల హరికోటి, కార్యదర్శులు ఐజక్, సూర్యప్రకాష్, యజ్ఞ ప్రసాద్, చంద్రు, గౌరవ సభ్యుడు రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏలూరులో స్కూలును సందర్శించిన ఇటలీ టూరిస్టులు



ఏలూరు అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : భారతదేశం లోని వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల ప్రజల ఆచార వ్యవహారాలు, సంస్కృతులను ప్రత్యక్షంగా తెలుసుకునే క్రమంలో ఇటలీ దేశానికి చెందిన అలె గ్జాండర్, జార్జా, క్యార, బెనదత్త బుధవారం ఏలూరు లోని ఓ ప్రైవేటు స్కూలును సందర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు చైతన్యం కలిగి ఉన్నారని, గ్రామీణ ప్రాంతాల్లోసైతం ఆధునిక సౌకర్యాలు, సాంకేతికత అందుబాటులో ఉందన్నారు. దేశంలో ఇంకా కొన్ని రాష్ట్రాలు వెనుకబడి ఉన్నాయని, ముఖ్యంగా బిహార్, ఒడిశా వంటి రాష్ట్రాలు అభివృద్ధి సాధించాల్సి ఉందన్నారు. స్కూలు సందర్శనకు గుర్తుగా వారితో మొక్కను నాటించారు. స్కూలు డైరెక్టర్ టి.ఎడ్వర్డ్, సీహెచ్ కుమార్, ఫాదర్ తోట ఆంథోని, సీహెచ్ ఉష, తదితరులున్నారు.

భయం.. భయం..

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా 'పాలకొల్లు టిడ్కో గృహాల కాలనీ'

» విచ్చలవిడిగా మైనర్లు గంజాయి సేవనంతో హల్‌చల్ » సాయంత్రమైతే హడలిపోతున్న ప్రజలు



పాలకొల్లులో టిడ్కో గృహాల కాలనీ

పాలకొల్లు టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):పట్టణంలో టిడ్కో గృహాల కాలనీలో నిత్యం ప్రజలు భయం.. భయంగా జీవనం గడుపుతున్నారు. మైనర్లు సైతం గంజాయి సేవించి చుట్టుపక్కల ఉండే వారితో నిత్యం తగువులు పడుతున్నారు. వీటితోపాటు కొన్ని ఇళ్ల వద్ద గుట్టుచప్పుడు కాకుండా కొంతమంది వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇక్కడికి కొందరు గంజాయిని ఇతర ప్రాంతాల నుంచి తీసుకుని మైనర్ బాలురకు గంజాయి తాగే అలవాటు చేసి ఒక బ్యాచ్‌గా ఏర్పాటు చేసి దందాలు నిర్వహిస్తున్నట్టు స్థానికులు వాపోతున్నారు. ఈరోడ్డు వెంబడి కొత్తపేట, గోరింటాడ, సగం చెరువు గ్రామస్థులు నరసాపురం పట్టణానికి ద్విచక్రవాహనాలపై అధిక సంఖ్యలో వెళ్లి వస్తుంటారు. సాయంత్రం సమయంలో అటుగా వచ్చే వారిని సదరు బ్యాచ్ అడ్డగించి భయభ్రాంతాలకు గురిచేసి బ్లేడుతో చేతులపై గాయాలు చేస్తున్నారు. వీటిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా వారిని గుర్తించి మైనర్లు కావడంతో కౌన్సెలింగ్ ఇచ్చి పంపిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ వీరి ధోరణి మారడం లేదని చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చి వెళ్లే వారు వాపోతున్నారు. పట్టణ పోలీసులను గస్తీని ఏర్పాటు చేసి పెట్రోలింగ్ నిర్వహించినా వీరి ఆగడాలకు అంతులేకుండా పోతుందని, ఇప్పటికే తమ ఇళ్లను అద్దెలకు ఇచ్చి పట్టణ ప్రాంతానికి అద్దె ఇళ్లలోకి వెళ్లి పోతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మొత్తంగా చూస్తే టిడ్కో ఇళ్లలో నివసించే వారిలో గొడవలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదులు చేసే వారి సంఖ్య ఎక్కువగానే ఉందని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు.

● ఈ రోడ్డులో ప్రైవేట్ కల్యాణ మండపం ఉండడంతో పెళ్లిళ్లకు బంగారు వస్తువులు వేసుకుని రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. గతంలో ఇక్కడ పెళ్లికి వచ్చిన ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు దుండగులు లాక్కుని వెళ్లిన సంఘన జరిగింది. స్థానిక మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు టిడ్కో ఇళ్లల్లో నివాసం ఉండే వారికోసం ఆ ప్రాంతంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. ఇలా ఆకతాయిల బెడద వల్ల ఈ కాలనీ ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారు. వారికి పట్టణ పోలీసులు శాశ్వత ప్రణాళిక రూపొం దించి, అక్కడ జరుగుతున్న ఆగడాలను నివారించి, ప్రతీ వీధికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీసులు కఠినంగా వ్యవహరించాలి



టిడ్కో గృహాలలో నివాసం ఉంటున్న ప్రజలకు పోలీసులు భరోసా కల్పించాలి. ప్రభుత్వం ఇచ్చిన సొంత ఇంటిలో నివసించే వారు ఆనందంగా ఉండాలంటే దుండగులు, ఆకతాయిల పట్ల పోలీసులు కొంత కఠినంగా వ్యవహరించాలి. మైనర్ బాలురు గంజాయి, మత్తు పదార్థాలను సేవిస్తూ విచ్చలవిడిగా హల్‌చల్ చేస్తుంటే పోలీలు పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చి పంపడం సరికాదు, సీసీ కెమోరాలు ఏర్పాటు చేయాలి.

- ఎస్.రాంబాబు, టిడ్కో గృహాల కాలనీ నివాసి, పాలకొల్లు



సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

నేటి బాలలే భావి భారత పౌరులు

ఏలూరు క్రైం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):నేటి బాలలే భావిభారత పౌరులు అని, బాలల స్నేహపూర్వక న్యాయ అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. 'బాలల స్నేహ పూర్వక న్యాయ సేవలు పథకం 2024'పై బుధవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో ఏలూరు శాంతినగర్‌లోని ఆక్స్‌ఫోర్డ్ ఒలింపియాడ్ స్కూలు విద్యార్థు లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలు విద్యార్థి దశలోనే చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకుని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులే లక్ష్యంగా సంఘ విద్రోహ శక్తులు మానవ అక్రమ రవాణా, డ్రగ్స్ విక్రయం వంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నాయని, అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బాలలకు అవసరమైన పక్షంలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీడబ్ల్యూసీ ఇన్‌ఛార్జి చైర్మన్ పి.వెంకటేశ్వరరావు, న్యాయవాది పి.రత్నరాజు, ఆక్స్‌ఫోర్డ్ ఒలింపియాడ్ స్కూల్ ప్రిన్సిపాల్ పసుపులేటి సునీల్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పారబోలా నైన్ సంస్థకు రెండు జాతీయ అవార్డులు

» మంత్రి సారథికి సీఎం చంద్రబాబు అభినందన



మంత్రి పార్థసారథిని అభినందిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

నూజివీడు టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో స్టార్టప్ సంస్థగా ప్రారంభమైన అమెరికాకు చెందిన పారబోలా నైన్ ఏఐ సంస్థ జాతీయ హాకథాన్‌లో రెండు జాతీయ అవార్డులను పొందింది. ఈ నేపథ్యంలో ట్రిపుల్ ఐటీలోని పారబోలా సంస్థ ఏర్పాటుకు కృషిచేసిన మంత్రి కొలుసు పార్థసారథిని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం అమరావతిలో అభినందించారు. జాతీయస్థాయిలో నిర్వహించిన హాకథాన్‌లో పోలీస్‌శాఖ, సివిల్ సప్లైస్ శాఖకు సంబంధించి సంస్థ ఇచ్చిన ఏఐ టెక్నాలజీ జాతీయస్థాయిలో అవార్డులను అందుకుంది. పారబోలా సంస్థ జాతీయ అవార్డులను పొందిన విషయాన్ని మంత్రి సారథి సీఎం దృష్టికి తీసుకువెళ్లగా నూజివీడు నియోజకవర్గాన్ని వ్యవసాయ పారిశ్రామిక, సమాచార సాంకేతిక రంగాల్లో రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉండేలా కృషిచేయాలని అందుకు సంబంధించి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి సారథికి సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.



ఏలూరు ర్యాలీలో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జడ్పీ సిబ్బంది

ఇంటింటా జాతీయ జెండా ఎగురవేద్దాం

» జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

జడ్పీ కార్యాలయం నుంచి హర్‌ఘర్ తిరంగా ర్యాలీ ప్రారంభం

ఏలూరుసిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ పతాకాన్ని ఇంటింటా ఎగురవేయడం దేశభక్తి ప్రదర్శనకు నిదర్శనమని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల ఐదో తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్న హర్‌ఘర్ తిరంగా ఉద్యమంలో భాగంగా బుధవారం ఏలూరు జడ్పీ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా ఆమె ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం ద్వారా మనం దేశాన్ని ప్రేమిస్తున్నామన్న సందేశం ప్రపంచానికి తెలియజేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుం టోందన్నారు. ప్రభుత్వ శాఖలపై త్రివర్ణ పతాకాల ఆవిష్కరణ, పాఠశాలలు, గ్రామ సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలపై జాతీయ పతాకాలను ఎగురవేయటం, ప్రజల్లో చైతన్యం కోసం ర్యాలీలు, పాటలపోటీలు, నినాద కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని కోరారు. జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి, టీడీపీ నేత ఘంటా ప్రసాదరావు, జడ్పీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పేలుడు పదార్థాల కేసులో ముగ్గురి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

పెనుమంట్ర, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆక్వా చెరువుల వద్ద పక్షులను తరిమికొట్టడానికి వినియోగిస్తున్న ఆయుధాలు, పేలుడు పదార్థాలపై పోలీసులు అటవీశాఖ అధికారులు తనిఖీ చేశారు. పొలమూరు గ్రామానికి చెందిన చింతపల్లి గురుప్రసాద్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో తనిఖీలు చేశారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ముగ్గురిని అరెస్ట్ చేసి 5 నాటు తుపాకులు, 10 కేజీల గన్ పౌడర్, మూడు కేజీల పిస్టోళ్ల స్వాధీనం చేసుకున్నారు. సోనురావు, సంతోష్, జై సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. 50 ఎకరాల ఆక్వా చెరువలు సాగు చేస్తున్న వేటూరి నారాయణరాజుపై కేసు నమోదు చేశారు.

నా కుమారుడి చేతి వేళ్లు పోయాయి

గత వేసవి సెలవుల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న నా కుమారుడు రెల్లి శివ గణేశ్ బ్రాహ్మణచెరువు రహదారి పక్కన పడిఉన్న డబ్బా చేతిలోకి తీసుకున్నారు. డబ్బా ఊపడంతో ఒక్కసారిగా పేలడంతో కుడిచేయి వేళ్లు తెగిపోయాయి. పేలుడుపై ఆరా తీసినా తెలియలేదు. పొలమూరు శివారులో ఆక్వా చెరువులపై పేలుడు పదార్థాలు ఉపయోగిస్తున్నారని తెలిసినా నిర్ధారణ కాలేదు. తాజా సంఘటనతో మా అబ్బాయి ప్రమాదానికి ఆక్వా రైతుల పేలుడు పదార్థాలు కారణమని భావిస్తున్నాం.



- రెల్లి శ్రీనివాస్, పొలమూరు

కాలువలో గల్లంతైన వృద్ధురాలు మృతి

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం జువ్వలపాలెంకు చెందిన రావి చంద్రావతి (75) క్యాన్సర్‌తో బాధపడుతూ మనస్థాపంతో కాలువలో దూకింది. అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యల్లో బుధవారం మృతదేహం బయట పడింది. అగ్నిమాపక అధికారి పర్యవేక్షణలో మంగళవారం గాలింపు చర్యలు ప్రారంభించగా బుధవారం ఆమె మృతదేహాన్ని గుర్తించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఆది ప్రసాద్ తెలిపారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌పై వెళుతున్న వృద్ధుడిని లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురై విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం కలకుర్రు గ్రామానికి చెందిన భలే వెంకటరావు (50) బుధవారం ఉదయం తన గ్రామం నుంచి మోటారు సైకిల్‌పై ఏలూరు వస్తున్నాడు. ఏలూరు నుంచి కైకలూరు వైపు వెళుతున్న లారీ మార్గమధ్యలో శ్రీపర్రు గురకలపేట వద్ద వెంకటరావు మోటారు సైకిల్‌ను ఢీకొంది. వెంకటరావు తీవ్ర గాయాలకు గురికాగా విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి వెంటనే తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఏలూరు రూరల్ పోలీసులకు సమాచారం అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఉండి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఉండి పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన సింగిరికొండ వేణుగోపాల్(50) ఆక్వా చెరువులకు మేత సరఫరా చేస్తాడు. ఈనెల 3న హైదరాబాద్ నుంచి ఉండి వచ్చిన అతను ఆకివీడుకు చెందిన ఎర్రా నరసింహారావుకు ఫోన్ చేసి ద్విచక్ర వాహనంపై వస్తే గణపవరం వెళదామని చెప్పాడు. వారిద్దరు కలిసి ఉండి నుంచి గణపవరం వెళుతుండగా థర్మాకోల్ ఫ్యాక్టరీ సమీపంలో వేణుగోపాల్‌కు ఫోన్ వచ్చింది. వాహనం ఆపి మాట్లాడుతుండగా అదే సమయంలో ఉండి నుంచి గణపవరం వెళుతున్న ద్విచక్ర వాహనదారు వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వేణుగోపాల్ తలకు తీవ్రగాయాలు కావడంతో అతడిని భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ వేణుగోపాల్ బుదవారం ఉదయం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.

అద్దె ఇంటి యజమానికి టోకరా

నగదు, బంగారు, కారుతో పరారు

ఏలూరు క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో అద్దెకు దిగిన కుటుంబం ఇంటి యజమానురాలికి మాయమాటలు చెప్పి నగదు, బంగారం, కారు తీసుకుని పరారయ్యారు. ఏలూరులోని అమీనాపేట ఏటిగట్టు ప్రాంతానికి పీటీఎస్ఎస్ ప్రభావతి అలియాస్ భాను ఇంటి రెండో అంతస్తులో జూన్ 22న పోచర్ల గణేష్ (30) తన కుటుంబంతో అద్దెకు దిగాడు. ప్రభావతితో కుటుంబ స్నేహం పెంచుకుని మాయ మాటలు చెప్పి ఆమె వద్ద రూ.25 లక్షలు తీసుకున్నాడు. బంగారు గొలుసు, చెవి పోగులు కూడా పది రోజుల్లో ఇస్తానని తీసుకున్నాడు. ఆమె కారు కూడా తీసుకుని ఆపై కనిపించకుండా వెళ్లిపోయాడు. గణేశ్ తల్లిదండ్రులు నిర్మల, రఘుబాబు కూడా ఆమె వద్ద డబ్బులు తీసుకుని మోసగించారు. ఈ ముగ్గురిపై ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు చేయడంతో సీఐ వి కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

భీమవరం క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): భీమవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బుధవారం నిర్వహించిన దాడులలో బెల్ట్ షాపు నిర్వాహకుడిని అరెస్ట్ చేశారు. భీమవరం రూరల్ మండలం లోసరి గ్రామంలో పి.దుర్గాప్రసాద్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద 8 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.బలరామరాజు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు పి.ఉమామహేశ్వరరావు, పి.సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

దుకాణం తొలగించారని ఆత్మహత్యాయత్నం

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తన దుకాణాన్ని తొలగించారని మనస్తాపానికి గురైన వ్యక్తి పురుగుల మందు తాగడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామానికి చెందిన దొబ్బిడి పెద్దిరాజు దూబచర్లలో కొబ్బరి బొండాలు, చెరుకు రసం, చిల్లర దుకాణం నిర్వహిస్తున్నారు. పక్కనే షాపింగ్ కాంప్లెక్స్ ఉండడంతో పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ అధికారులు గత నెల 30న దుకాణాలను తొలగించారు. దీనితో పెద్దిరాజు పురుగులమందు తాగాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ ప్రభుత్వాసుపత్రిలో బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి బంధువులు ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. నల్లజర్ల సీఐ, ఎస్ఐ, సిబ్బంది మృతుని బంధువుల నుంచి వాగ్మూలం నమోదు చేశారు. మృత దేహాన్ని మార్చురీలో ఉంచారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఒక యువకుడు పురుగుల మందు తాగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం పోణంగి గ్రామానికి చెందిన కలపర్తి శేషయ్య (35)కు భార్య గతంలో విడాకులు తీసుకుని వెళ్లిపోయింది. ఒంటరిగా జీవిస్తున్న శేషయ్య తల్లి, పిన్ని వద్ద డబ్బులు తీసుకుంటూ ఉంటాడు. ఇదే విధంగా జాలిపూడిలో తల్లి వద్దకు ఈనెల 5న వెళ్లి రూ.200 తీసుకున్నాడు. శ్రీపర్రులో పిన్ని వద్ద కూడా డబ్బులు తీసుకున్నాడు. శ్రీపర్రు కాల్వ గట్టు వద్ద పురుగుల మందుతాగి తన పిన్ని వద్దకు వెళ్లి చెప్పాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు.

తాతయ్య మందలించాడని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తాతయ్య మందలించడంతో బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పెదవేగి మండలంలో హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బాలిక (15) తల్లిదండ్రులు ఊరు వెళ్లారు. తాతయ్య వద్ద ఉంటున్న బాలిక మూడు రోజుల నుంచి పాఠశాలకు వెళ్లడంలేదు. తాతయ్య మందలించడంతో మనస్తాపానికి గురైన బాలిక పొలంలో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తీవ్ర అస్వస్థతకు గురైన బాలికను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

భార్యాభర్తల మధ్య గొడవ మహిళ ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవ జరిగి విభేదాలు రావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఒక మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మండవల్లి మండలం ప్రత్తిపాడు గ్రామానికి తేరా సుధారాణి (35)కు ఆమె భర్త రమేష్‌కు మధ్య ఈనెల 5న గొడవ జరిగింది. ఈనేపథ్యంలో పురుగుల మందు తాగింది. ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత మృతి చెందింది. మృతదేహాన్ని ఆసుపత్రి మార్చురీలో ఉంచారు. ఈ సంఘటనపై మండవల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిబ్బంది విధులకు ఆటంకం

ఆకివీడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీ సిబ్బందిని అడ్డుకుని విధులకు ఆటంకంపరిచారని కమిషనర్ కృష్ణమోహన్ ఫిర్యాదు మేరకు రైటర్ డీవీ రమణ కేసు నమోదు చేశారు. స్థానిక దుంపగడప వైపు వెళ్ళు రైల్వేగేటు సమీపంలోని జవహార్ పేటలో ఉన్న నగర పంచాయతీ వాల్ బంద్ చేయడానికి బుధవారం ఉద యం సిబ్బంది కందుకూరి సన్నిబాబు, కట్టా నరేంద్ర వెళ్ళారు. అయితే సిబ్బందిని వాల్ మూయనివ్వకుండా కొంతమంది అక్కడకు వచ్చి సిబ్బందిని అడ్డుకున్నారని కమిషనర్ ఫిర్యాదు చేశారు.

మోటార్ సైకిల్ చోరీ

ఆకివీడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సిద్ధాపురానికి చెందిన గండికోట దుర్గారావు జూలై 11న తన ఇంటి వరండాలో మోటార్ సైకిల్‌ను పార్కు చేసి విజయవాడ బంధువుల ఇంటికి వెళ్ళాడు. 13న ఇంటికి వచ్చే సరికి గేటు తాళం పగలు కొట్టి మోటారు సైకిల్‌ను దొంగిలించారని దుర్గారావు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హనుమంతు నాగరాజు కేసు నమోదు చేశారు.





భీమవరంలో తల్లులు, బాలింతలకు పండ్లు అందజేత. చిత్రంలో ఎమ్మెల్యే అంజిబాబు, జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి... తణుకులో ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి.. పెదఅమిరంలో చిన్నారులకు ఆర్ఆర్ఆర్ అభినందన

తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహించాలి

భీమవరం టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహించవలసిన ప్రాధాన్యత ఎంతైనా ఉందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. పంచ తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా బుధవారం కాస్మోపాలిటన్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అంజిబాబు, ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డ ప్రసవించిన గంటలోపుగానే ఇచ్చినట్లయితే ఆ బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మన సాంప్రదాయంలో తల్లిని గౌరవించాలి అని ఉందన్నారు. తల్లిపాలకి ఉన్న ఆవశ్యకతలో మొదటి గంట గోల్డెన్ అవర్ అని అన్నారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి శ్రీలక్ష్మి కార్యక్రమ వివరాలను తెలిపారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పండ్లను ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఆర్‌డివో కె ప్రవీణ్ కుమార్ రెడ్డి, డిఐఓ డాక్టర్ దేవా సుధాలక్ష్మి పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీల బలోపేతానికి కృషి

తణుకు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో మార్కెట్ కమిటీ నిధులను నిర్వీర్యం చేశారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆరోపించారు. బుధవారం ఏఎంసీ కార్యాలయంలో మార్కెట్ కమిటి ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతులకు ఇబ్బందులు లేకుండా మార్కెట్ కమిటీలను బలోపేతం చేసే దిశగా కృషి చేస్తుందన్నారు. తణుకు మార్కెట్ కమిటిలో రూ.30కోట్ల నిధులు ఉన్నాయని, ఆ నిధులను గత వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్నారు. పలు పన్నుల రూపంలో ఏడాదికి ఏడు కోట్లు ఆదాయం సమకూరుతుందని చెప్పారు. అనంతరం చైర్మన్‌గా కొండేటి శివ, ఉపాధ్యక్షుడుగా వల్లూరి మోహన్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు.

చిన్నారులకు డిప్యూటీ స్పీకర్ అభినందన

కాళ్ళ ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించిన అక్కాచెల్లిని ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అభినందించారు. బుధవారం పెద అమిరంలోని ఆయన కార్యాలయంలో వారిని సత్కరించారు. కాళ్ళ గ్రామంలో సాయి భావన ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు కొల్లి విద్యశ్రీవల్లి, జస్విక శ్రీజ చిన్న వయస్సులోనే మనిషి బాడీ పార్ట్స్, దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానులు, వింతలు విశేషాలతోపాటు జనరల్ నాలెడ్జ్‌లో ప్రతిభ కనబరిచినందుకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించారు. వీరిరువురూ భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు సాధించాలని రఘురామకృష్ణరాజు ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొల్లి సుబ్బారావు, పాఠశాల కరస్పాండెంట్ ఎం.బుజ్జిబాబు, ఉండి డీసీ చైర్మన్ తోట ఫణిబాబు పాల్గొన్నారు.

దేవాలయం నిర్మాణానికి చర్యలు

తణుకు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రేలంగి గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునఃప్రతిష్ఠకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో రేలంగి గ్రామస్థులు ఆలయ పునః నిర్మాణానికి జరుగుతున్న చర్యలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2.20కోట్ల నిధులతో రాతి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే గ్రామస్థులు రూ.73.33లక్షల విరాళాన్ని సేకరించడం అభినందనీయమన్నారు. సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్ళి రూ.1.46కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. త్వరలోనే భక్తులకు ఆలయం నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు.

కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి

గణపవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కాలుష్య మహమ్మారి నుంచి కాపాడుకునేందుకు ప్రతి విద్యార్థి మొక్కలు నాటాలని వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు అల్లూరి గంగరాజు కోరారు. బుధవారం గణపవరంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాలలోనూ విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలి

భీమవరం రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి తగిన సూచనలు ఇవ్వాలని ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రాం మానిటరింగ్ ఆఫీసర్ డా. ఎం. గులాబ్ రాజ్‌కుమార్ అన్నారు. వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామంలో నిర్వహిస్తున్న 104 వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీబీ, క్యాన్సర్ కేసులు, ఎన్‌సిడి-సిడి సర్వేపై ప్రజల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు.

సమానంగా నీటి సరఫరా చేయాలి

ఆకివీడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కుళాయిల ద్వారా తాగునీరు ప్రజలందరికీ సమానంగా సరఫరా చేయాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. స్థానిక జవహార్‌పేట సమీపంలో నగర పంచాయతీ ఏర్పాటు చేసిన వాల్ దగ్గర సీపీఎం నాయకులు బొక్కా వర్మ, గేదెల రవితేజ, సందక సూరిబాబు, షేక్ బాజీ, వైసీపీ కౌన్సిలర్లు గేదెల అప్పారావు, పడాల శ్రీనివాసరెడ్డి బుధవారం నిరసనలు తెలిపారు. పట్టణ పరిధిలో ధనికులకు ఒక మాదిరిగా, పేదలకు మరోక మాదిరిగా వివక్ష చూపుతూ సంబంధిత అధికారులు తాగునీరు సరఫరా చేస్తున్నారన్నారని ఆరోపించారు.

చెరుకుమిల్లి త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా రామకృష్ణరాజు



ఆకివీడు రూరల్ ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): చెరుకుమిల్లి సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా కనుమూరు రామకృష్ణరాజు ఎంపికైనట్లు మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాదు తెలిపారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు ఆదేశాల మేరకు చైర్మన్‌గా రామకృష్ణరాజు, డైరెక్టర్లుగా దాట్ల సీతారామరాజు, తాటిపర్తి వెంకటేష్‌లు నియమింపబడ్డారని తెలిపారు. కనుమూరు రామకృష్ణరాజు అయిభీమవరం సర్పంచ్‌గా, ఉపసర్పంచ్‌గా, నీటి సంఘం అధ్యక్షులుగా, చెరుకుమిల్లి సొసైటీ సభ్యులుగా పనిచేశారు.

ఆచంట సీహెచ్‌సీ తనిఖీ



వైద్యులతో మాట్లాడుతున్న సూర్యనారాయణ

ఆచంట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆచంట సీహెచ్‌సీని జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ పి. సూర్యనారాయణ పరిశీలించారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్య సేవలు ఎలా అందిస్తున్నారంటూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ప్రజలకు సేవ చేసేలా ఉండి ప్రజల నుంచి మన్ననలు పొందేలా ఉండాలన్నారు. వైద్య సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయా.. లేదా అని ఆసుపత్రికి వచ్చిన రోగులను అడిగి తెలుసుకున్నారు. పలు వార్డులను సందర్శించిరు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివ రంజని, సూపరింటెండెంట్, వైద్యులు పాల్గొన్నారు.

పోడూరు దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం

పోడూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : పోడూరు శ్రీ మూలేశ్వరస్వామి, రాజేశ్వర స్వామి, కేశవస్వామి వార్ల దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్‌గా కోసూరి వెంకట రామ సత్య సూర్య నారాయణ రాజు, మరో 9 మంది సభ్యులుగా బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. దేవస్థానం ఈవో గుబ్బల రామపెద్దింట్లురావు ప్రమాణస్వీకారం చేయించారు. ఈకార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్దరాజు రవి రాజు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి రుద్రరాజు రమేష్‌రాజు, సర్పంచ్ సువర్ణరాజు పాల్గొన్నారు.

వైద్య శిబిరం పరిశీలన

మొగల్తూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని బుధవారం జిల్లా ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ డాక్టర్ గులాం రవికుమార్ సందర్శించారు. మొగల్తూరు పంచాయతీ మూడవ గ్రామ సచివాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు స్థానిక వైద్యురాలు లక్ష్మీపార్వతిని అడిగి తెలుసుకున్నారు.

ఆకివీడు త్రిసభ్య కమిటీ ఎంపిక

ఆకివీడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు విశాల సహకార పరపతి సంఘం (రూరల్ బ్యాంకు)కు త్రిసభ్య కమిటి నియామకం జరిగినట్లు టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్ తెలిపారు. చైర్మన్‌గా ముత్యాల వెంకటేశ్వరరావు (రత్నం), డైరెక్టర్లుగా మర్రివాడ వెంకట్రావు, వూడిగ శ్రీనివాసరావు నియమింపబడ్డారన్నారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):మునిసిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూసనపూడి సోమసుందర్ డిమాండ్ చేశారు. బుధవారం సిపాయిపేటలోని భవననిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో సమావేశం జరిగింది. ఏఐటీయూసి ఏరియా కమిటీ అధ్యక్షుడు ఓ.వీరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సోమసుందర్ మాట్లాడుతూ ఉద్యోగుల, కార్మికుల పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లోని డీఏ బకాయిలు, ఎరండ్ లీవులు సొమ్ము చెల్లించాలని, కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కళింగ లక్ష్మణరావు, ఏరియాకమిటీ కార్యదర్శి మండలపర్తి హరీష్ పాల్గొన్నారు.

వేతన వేదన

(5వ పేజీ తరువాయి)

అప్‌లోడ్ సమయంలోనే తిరిగి బిల్లు పెట్టాలి. అంటే అందరికీ పొజిషన్ ఐడీలు వచ్చి ఆగస్టు తొలి వారంలో సప్లిమెంటరీ బిల్లుగా అప్‌లోడ్ చేస్తే సెప్టెంబరు ఒకటో తేదీన జూన్, జూలై నెల జీతాలు వస్తాయని టీచర్లు వ్యాఖ్యానిస్తున్నారు. విద్యా శాఖ, ఖజానా శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో జీతాలు సకాలంలో అందుకోలేని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

విద్యా శక్తిని బహిష్కరించిన ఫ్యాప్టో

(5వ పేజీ తరువాయి)

నారాయణకు బుధవారం మెమోరాండం సమర్పించారు. ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ విద్యా శక్తి ఐచ్ఛికం మాత్రమే గాని నిర్బంధం కాదని ప్రభుత్వం చెబుతున్నప్పటికి కొందరు అధికారులు తప్పకుండా చేయాలని నిర్బంధిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-చైర్మన్ సాయివర్మ, ఎన్.శ్రీనివాస్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ రమణ, కోశాధికారి పట్టాభిరామయ్య, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం

తాడేపల్లిగూడెం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల నిర్లక్ష్య ధోరణిలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఉన్నాయని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ ఆరోపించారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పట్టణ మూడవ మహాసభ సుందరయ్య భవనంలో బుధవారం మీసాల పావని అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా పట్టణ నూతన కమిటీ అధ్యక్షురాలుగా మీసాల పావని, ఉపాధ్యక్షురాలుగా కే రామతులసి, కార్యదర్శిగా బంకురు యశోదా దేవి, సహాయ కార్యదర్శిగా తాడికొండ దుర్గ, కోశాధికారిగా కూనపాముల దయామణి, కమిటీ సభ్యురాలుగా వెంకటలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నత్తనడకన సాగు



కొఠాలపర్రులో నారుమడుల దశలోనే పొలాలు

పెనుగొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి):ఖరీఫ్ సాగు నత్తనడక సాగుతున్నది. సకాలంలో వర్షాలు పడకపోవడం, పంట కాలువల ద్వారా నీరు సరిగా అందకపోవడంతో ముందస్తు ఖరీఫ్ సాగు కాస్త వెనుకబడింది. మండలంలోని కొఠాలపర్రు, వడలి, మునమర్రు గ్రామాల్లో పలు చోట్ల నీటి ఎద్దడి ఏర్పడంతో ఇక్కడి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. సరైన వర్షాలు పడని కారణంగా నాట్లు సైతం ఇంకా పూర్తి కాలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

పెంటపాడు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఎం నాయకులు సిరపరపు రంగారావు, చిర్లా పుల్లారెడ్డి, బంకూరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం పెంటపాడు గేటు సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వాన్ని విమర్శించిన ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అవే విధానాలను అమలు చేయడం సిగ్గు చేటన్నారు.

నరసాపురం టౌన్: స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలంటూ బుధవారం ప్రజావేదిక ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు ఎం రామాంజనేయులు మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపేందుకు ప్రభుత్వం స్మార్ట్‌మీటర్ల పేరుతో దోపిడికి పాల్పడుతుందన్నారు. ఈతక్షణం ఈ విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పేదలకు సహాయం అందించేందుకు ఎస్‌బీఐ ఆఫీసర్స్ సంఘం చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ అశోక్ నాయుడు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని ఎస్‌బీఐ సెంటర్ వద్ద బుధవారం సంఘ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పేద మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యదర్శి జవహర్ లాల్, నాయకులు ప్రభాకర్, రాధాకృష్ణమూర్తి, స్వరూప్, ప్రేమ్‌కుమార్, వినీతాదేవి, ఆదిలక్ష్మి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఎల్ అగ్రహారం టిడ్‌కో ఇళ్ల సముదాయాల వద్ద బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపి జిల్లా మీడియా కన్వీనర్ నరిసే సోమేష్ పాల్గొని ప్రారంభించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దువ్వ శ్రీను, కార్యదర్శి నాగబుజ్జి, నియోజకవర్గ కోకన్వీనర్ రామగాని శ్రీను పాల్గొన్నారు.

కష్టపడే కార్యకర్తలకు బీజేపీలో గుర్తింపు



సింహాద్రి లక్ష్మణ్‌కుమార్ గుప్తా దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

తణుకు రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పని చేసే కార్యకర్తలకు బీజేపీలో ఎప్పుడూ గుర్తింపు వుంటుందని జిల్లా బీజేపీ అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీదేవి తెలిపారు. బుధవారం దువ్వ గ్రామంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడుగా నియమితులైన సింహాద్రి లక్ష్మణ్‌కుమార్ గుప్తాకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం లక్ష్మణ్ కుమార్ గుప్తాను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా పూర్వ అధ్యక్షుడు నార్నీ తాతాజీ, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

తాళ్ళకోడు అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..

ఆకివీడు రూరల్ ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కుప్పనపూడి పంచాయతీలోని తాళ్ళకోడుల లేఅవుట్‌లో అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని వైసీపీ నాయకులకు కూటమి నాయకులు సవాల్ విసిరారు. బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో తెలుగుదేశం పార్టీ హయాంలోనే తాళ్ళకోడు గ్రామంలో అభివృద్ధి జరిగిందని, వైసీపీ హయాంలో స్థలాలను కుదించి కేవలం సెంటుకే పరిమితం చేశారని అన్నారు. మంచినీటి చెరువు లేదని, శ్మశానం సమస్య అలాగే ఉందని, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, డ్రెయినేజీ వ్యవస్థ లేదని ఆరోపించారు. తాళ్ళకోడు కాలనీ అభివృద్ధికి సుమారు రూ.5.40కోట్లు రోడ్లు, పైపులైను నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. ఉపసర్పంచ్ జన్ను గోపి, మాజీ సర్పంచ్ అప్పలు, గ్రామపార్టీ అధ్యక్షులు త్రిమూర్తులు, వార్డు సభ్యులు ముద్దేకేశవ, ముత్యాలశ్రీను, జనసేన నాయకులు కారెంపూడి సుమంత్ పాల్గన్నారు.

తల్లిపాలతోనే పిల్లలకు ఆరోగ్యం

జిల్లా అంతటా తల్లిపాల వారోత్సవాలు



తాడేపల్లిగూడెంలో బాలింతలను సన్మానించిన దృశ్యం

తాడేపల్లిగూడెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలలోనే ఆరోగ్యం దాగి ఉందని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కోడలు దేవిప్రియ అన్నారు. తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌లో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఐసీడీఎస్ సీడీపీవో టిఎల్ సరస్వతి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా దేవిప్రియ పాల్గొన్నారు. తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. బాలింతలకు బేబీకిట్స్ అందజేశారు. తల్లులకు పండ్లు అందజేశారు. పాలిచ్చేందుకు ఏర్పాటు చేసిన గదిని కూడా ప్రారంభించారు. రైల్వే స్టేషన్‌లో పనిచేసే మహిళా పారిశుధ్యం కార్మికులను సన్మానించారు. కాళ్లగోపాలకృష్ణ (గోపి) ఆర్థిక సహకారంతో రెండు ఉయ్యాలలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకాశపు స్వామి, ఉభయ గోదావరి జిల్లాల జనసేన కోఆర్డినేటర్ కసిరెడ్డి మధులత, తాడేపల్లిగూడెం ఏఎంసీ చైర్మన్ మంగాబాయి పాల్గొన్నారు.

పెనుమంట్ర: తల్లిపాలు శిశు ఆరోగ్యానికి ప్రథమ ఔషధమని ఎమ్మెల్యే తనయుడు పితాని వెంకట్ అన్నారు. మార్టేరులో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. అనంతరం వెంకట్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మట్టకుమారి, ప్రాజెక్టు ఐసీడీఎస్ అధికారి ఎ. కృష్ణకుమారి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గణపవరం: పుట్టిన బిడ్డకు తల్లిపాలే తొలి టీకా అని పీహెచ్‌సీ వైద్యాధికారి కే.ఓంకార్‌నాథ్ అన్నారు. గణపవరం వెలమపేటలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాలతో మెదడు ఎదుగుదల, వ్యాధినిరోధక శక్తి పెరుగుతాయన్నారు. నిమోనియా, ఆకస్మిక శిశుమరణాలు వంటివి కూడా తగ్గుతాయని డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో విల్సన్ బాబు, అంగన్వాడీ, డ్వాక్రా, ఆశాలు పాల్గొన్నారు.

పెనుగొండ: తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం ఇస్తాయని సర్పంచ్ కె. విజయలక్ష్మి అన్నారు. వడలి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించాలన్నారు. దీని వల్ల బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీఎంఎం రూతు కుమారి, అంగన్‌వాడీలు,తల్లులు పాల్గొన్నారు.

పెంటపాడు: బిడ్డలకు ఆరోగ్యం తల్లిపాలతోనే సాధ్యమని వైద్య సిబ్బంది సూచించారు. పెంటపాడు పీహెచ్‌సీలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. పుట్టిన పిల్లలకు తప్పని సరిగా తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని చెప్పారు.

తణుకు రూరల్: పుట్టిన పిల్లలకు తల్లిపాలు పట్టడం ద్వారా వారిలో రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధులకు దూరంగా వుంటారని తణుకు ఐసీడీఎస్ సీహెచ్ వెంకట లక్ష్మీ అన్నారు. బుధవారం దువ్వ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, మహిళలు, అంగన్‌వాడీ వర్కర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు. కొమరవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆయాలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తీర ప్రాంతంలో సమస్యల్ని పరిష్కరిస్తాం

నరసాపురం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలో దీర్ఘకాలిక సమస్యల్ని దశలవారీగా పరిష్కరిస్తామని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అన్నారు. బుధవారం వేములదీవి గ్రామంలో సుపరిపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలందించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధిని వివరించారు. ఇటు పట్టణంలోని 5వ వార్డులో మత్స్యకార సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు ఆధ్వర్యంలో సుపరిపాలన నిర్వహించారు. వాతాడి ఉమా, తాతయ్య, ముక్తేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, లక్ష్మణరావు, సంగాని మూర్తి, వెంకటేశ్వరావు, హరి, రాంబాబు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌లకు శిక్షణ

నరసాపురం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నరసాపురం, మొగల్తూరు మండలాల్లో పని చేస్తున్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఉపాధి కార్మికులకు పనులు కల్పించడం, జియోట్యాగింగ్, అమృత్ సరోవర్, నూతన విధానంపై డ్వామా పీడీ అప్పారావు అవగాహన కల్పించారు.

శ్మశాన వాటికకు స్థలం ఇవ్వాలంటూ ధర్నా

నరసాపురం టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలంటూ బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో సీతారాంపురం ఎస్టీ కాలనీ వాసులు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కవురు పెద్దిరాజు మాట్లాడుతూ కాలనీలో సుమారు 150 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. అయితే శ్మశాన వాటిక లేక పోవడం వల్ల ఖననం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు గ్రామంలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని విన్నవించారు.

ట్రాన్స్‌కో ఏడీఈగా మధు బాధ్యతలు



నరసాపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నరసాపురం ట్రాన్స్‌కో ఏడీఈగా మధు బాధ్యతలు చేపట్టారు. ఆయన విజయవాడ నుంచి పదోన్నతిపై ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ఓంకార్ పదోన్నతిపై విశాఖకు వెళ్లారు. గతంలో వీరు ఆచంట ఏఈగా పని చేశారు. బాధ్యతలు చేపట్టిన ఆయన్ను ఏఈ రామ్మోహన్, కుమార్, సిబ్బంది అభినందించారు.

బార్ ఎన్నికల్లో నలుగురు ఏకగ్రీవం

నరసాపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికల్లో నలుగురు అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. ఒక్కొక్కరు మాత్రమే నామినేషన్లు వేయడంతో వీరి ఎన్నిక ఏకగ్రీవమైనట్లు రిటర్నింగ్ అధికారి నల్లిమిల్లి జోసఫ్ తెలిపారు. వారిలో కోశాధికారిగా పురెళ్ళ శ్రీనివాస్, లైబ్రరీ కార్యదర్శిగా నారిన శ్రీనివాస్, మహిళా ప్రతినిధిగా మణి, మహిళా కార్యవర్గ సభ్యురాలుగా ఓసూరి జ్యోతి ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు గురువారం వరకు గడువు ఉంది. ఇప్పటి వరకు అధ్యక్ష పదవికి ఇద్దరు, ఉపాధ్యక్ష పదవికి ఇద్దరు, ప్రధాన కార్యదర్శికి ముగ్గురు పోటీలో ఉన్నారు. ఈనెల 13న పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికలు నిర్వహిస్తారు.

టెన్నికాయిట్ జిల్లా జట్టుకు లోటస్ విద్యార్థి



దేవేంద్ర నాయుడు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): టెన్నికాయిట్ జిల్లా జట్టుకు పెదతాడేపల్లికి చెందిన లోటస్ స్కూల్ విద్యార్థి అడ్డాల జైమణి వెంకట దేవేంద్ర నాయుడు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ బొలిశెట్టి దేవి ప్రియ తెలిపారు. ఈ నెల 3వ తేదిన తణుకులో నిర్వహించిన టెన్నికాయిట్ జిల్లా జట్టు ఎంపికలో ప్రతిభ కనబరిచి జట్టుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ బొలిశెట్టి రాజేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



పెంటపాడు పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో గీతాబాయి

పెంటపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో గీతాబాయి అన్నారు. బుధవారం పెంటపాడు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రికార్డులు, ఓపీ లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ రోగుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలన్నారు. వచ్చిన వారి పట్ల సిబ్బంది ప్రేమతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తోట రాజేష్‌కుమార్, సిబ్బంది సుజాత, సాయిబాబ, తేజోనాథ్, కుమార్ పాల్గొన్నారు

200 యూనిట్ల ఉచిత విద్యుత్ పట్ల హర్షం



పొట్నూరి చంద్రశేఖర్

పెంటపాడు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్లు విద్యుత్ ఉచితంగా అందిస్తామంటూ కూటమి ప్రభుత్వం కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమని నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొట్నూరి చంద్రశేఖర్ అన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెంటపాడు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు కారణంగా గురువారం మండలంలోని కే.పెంటపాడు, పరిమెళ్ళ, యానాలపల్లి, పడమర విప్పర్రు గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఈఈ నర్సింహమూర్తి తెలిపారు.

శ్మశానంలో సర్వేకు అధికారుల యత్నం

అడ్డుకున్న దళితులు



దళితులతో మాట్లాడుతున్న పోలీసులు

ఉండి, ఆగస్టు 6 (ఆంధ్ర జ్యోతి):తవం పూర్వీకుల నుంచి వినియోగించుకుంటున్న దళితుల శ్మశాన వాటిక స్థలంలో రోడ్డు వేస్తే సహించేదిలేదని దళిత నాయకులు హెచ్చరించారు. బుధవారం పాములపర్రులోని దళితుల శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడుకోవడం కోసం రాస్తోరోకో నిర్వహించారు. పాములపర్రులోని శ్మశాన వాటిక స్థలంలో వున్న ప్రభుత్వ భూమిని సర్వే చేయడానికి అధికారులు విచ్చేశారు. ఇది తెలుసుకున్న దళితులు ఆప్రాంతానికి వెళ్లి అడ్డుకున్నారు. పూర్వం నుంచి ఇదే ప్రాంతంలో తాము శ్మశానంగా వినియోగించుకుంటున్నామని తెలిపారు. వేరే గ్రామమైన కోలమూరుకు చెందిన రైతుల కోసం రోడ్డు వేయడానికి అధికారులు రావడం దారుణమంటూ దళితులు ఆరోపించి అడ్డుకున్నారు. దీంతో పోలీసులు విచ్చేసి దళితులను తోసివేశారు. దాంతో పలువురు దళితులు అదేప్రాంతంలో కిందపడిపోయారు ఒకరు స్పృహ తప్పారు. దాంతో దళితులు పాములపర్రు వంతెన వద్దకు వచ్చి స్పృహతప్పిపోయిన వ్యక్తిని రోడ్డుపై పడుకోబెట్టి జాతీయరహదారిపై రాస్తోరోకో నిర్వహించారు. తోపులాటలో గాయపడిన వారిని 108లో భీమవరం తరలించారు. రోడ్డు వేయడానికి ప్రయత్నిస్తే ఆందోళనను ఉధృతం చేస్తామని దళితులు హెచ్చరించారు.